క్లుప్తంగా

వరద బాధితులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న పార్థ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సభ్యులు

నల్లజర్ల: విజయవాడ వరద బాధితులకు నల్లజర్ల మండలంలోని పార్థ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ తన వంతు సాయం చేసింది. విజయవాడలోని పాయకాపురం కండ్రిగకు చెందిన 1,000 మందికి సినీనటుడు ముల్లేటి బాలాజీ చేతుల మీదుగా ఈ సంస్థ మంగళవారం దుప్పట్లు అందజేసింది. కార్యక్రమంలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు గురుమూర్తి, దేవరాజు అచ్యుతరావు, నెక్కంటి వెంకటేష్, వసాది త్రినాథ్, గొట్టుపల్లి వెంకట్రావు, ఎస్.వెంకట్రావు, నందా, చైతన్య, హేమంత్‌కుమార్, ఆలమండ గణేశ్ పాల్గొన్నారు.

దూబచర్లలో రక్తదాన శిబిరం

నల్లజర్ల: రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ దూబచర్ల శాఖ ఆధ్వర్యంలో ఆ గ్రామంలోని ఎలైట్ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రి బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 30 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు, ఎలైట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె. శ్రీలక్ష్మి, అంబటి శ్రీనివాసరావు, తాతిన సత్యనారాయణ, మహమ్మద్ ఇలియాస్ షరీఫ్, చీమకుర్తి సత్యకృష్ణ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బి.రత్నం పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నేడు అవగాహన సదస్సు

కొవ్వూరు: ఎస్సీ వర్గీకరణపై బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక ఔరంగాబాద్ కమ్యూనిటీ హాల్ వద్ద అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్టు దళిత రక్షణ దళం నాయకుడు కొడమంచిలి రమణ మంగళవారం తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు శాశ్వత పరిష్కారం చూపాలని, క్రీమీలేయర్ అంశంపైనా మాదిగ మేధావులతో చర్చించనున్నట్టు తెలిపారు.

వృద్ధాశ్రమానికి సీలింగ్ ఫ్యాన్ల బహూకరణ



వృద్ధాశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు అందజేస్తున్న బీఓబీ మేనేజర్ సురేంద్ర కుమార్ నాయుడు

దేవరపల్లి: ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బ్యాంక్ ఆఫ్ బరోడా యర్నగూడెం శాఖ ఆధ్వర్యంలో మేనేజర్ గుడివాడ సురేంద్ర కుమార్ నాయుడు మంగళవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణంపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమానికి ఆరు సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ఆశ్రమంలోని వృద్ధులకు తాడేపల్లిగూడెం యోగా గురు రేణుకాదేవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరు శ్రీనివాస్, సంఘమిత్ర స్కూల్ కరస్పాండెంట్ గుంపుల సత్యకృష్ణ, ఆశ్రమ నిర్వాహకురాలు జి. శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ

ఉండ్రాజవరం: మండలంలో మోర్త నంబర్-2 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఐడెంటిటీ కార్డులు అందజేశారు. పైడిపర్రు-తేతలి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉందుర్తి ప్రసన్న కుమార్, ఉందుర్తి పాల్ ఫౌండేషన్ దున్నా అమర్ బాబు, తలపాకుల అఖిల్ చేతుల మీదుగా విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. పైడిపర్రు-తేతలి లయన్స్ క్లబ్, ఉందుర్తి పాల్ ఫౌండేషన్ సంయుక్తంగా సుమారు రూ.4 వేల ఆర్థిక సహకారంతో పాఠశాలలో విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులు, దేశ నాయకుల లామినేషన్ ఫొటోలను పాఠశాల హెచ్ఎం ఎస్ఎల్‌వీ ప్రసాదరావుకు అందజేశారు.

వృద్ధుల అనుభవాలే జీవిత గుణపాఠాలు

- యువత ఆదర్శంగా తీసుకోవాలి
- లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ అధ్యక్షుడు మద్దిపాటి
- కొవ్వూరు, నిడదవోలులో వృద్ధుల దినోత్సవం
- పలువురికి సన్మానం

కొవ్వూరు: వృద్ధుల అనుభవాలే ఎవరికైనా జీవిత గుణపాఠాలని, వారి అనుభవాలను యువత ఆదర్శంగా తీసుకుని జీవనం సాగించాలని లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ అధ్యక్షుడు మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన పలువురు సీనియర్ సిటిజన్లను సత్కరించారు. ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త రెడ్డి తాతయ్యబాబు, రిటైర్డు బ్యాంక్ మేనేజర్ పులవ సత్యనారాయణ, సాయి సేవాదళ్ సభ్యుడు కారంచేటి హనుమంతరావు, రిటైర్డ్ పీఈటీ ఎస్.లక్ష్మీపతిరాజు, కోడూరి లక్ష్మీప్రసాద్‌లను ఘనంగా సత్కరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు కంఠమణి రామకిషోర్, పాలెంపాటి చినబాబు చౌదరి, ఎండీ హుస్సేన్, మన్యం బులిబాబు, గోలి వెంకటరత్నం, యు. రామకృష్ణ, ముళ్లపూడి కాశీ, పెనుమాక జయరాజు, బూరుపల్లి వెంకటేశ్వరరావు, యనమదల సుబ్రహ్మణ్యం, కలగర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించిన లయన్స్ క్లబ్ సభ్యులు

వృద్ధాశ్రమంలో..

సీనియర్ సిటిజన్ల హక్కుల పరిరక్షణకు న్యాయస్థానాలు కట్టుబడి ఉన్నాయని, వారికి ఉచిత న్యాయం అందజేస్తున్నట్టు ప్యానల్ న్యాయవాది పీపీపీ లక్ష్మి తెలిపారు. సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక వాత్సల్య వృద్ధాశ్రమంలో వృద్ధుల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

వృద్ధులను ఆదరించాలి

నిడదవోలు: వృద్ధులను ఆదరించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె. మదన్‌మోహన్ రెడ్డి అన్నారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని మంగళవారం స్థానిక మున్సిపల్ బీసీ కమ్యూనిటీ హాల్లో ఆ సంఘాధ్యక్షుడు అడపా సూర్యచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండ నిర్మల మాట్లాడుతూ సమాజంలో వృద్ధులకు ఆదరణ కరవైందన్నారు. దీంతో వృద్ధాశ్రమాలు పెరిగిపోయాయన్నారు. నిడదవోలు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘానికి కార్యాలయంతో పాటు ఒక షెల్టర్ ఏర్పాటు చేయడానికి మున్సిపాలిటీ, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సహకరించాలని సమావేశంలో కోరారు.



నిడదవోలులో వృద్ధులను సత్కరించిన నిర్వాహకులు

అనంతరం 80 ఏళ్ళు నిండిన 21 మంది వృద్ధులను ఘనంగా సత్కరించారు. 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీచేశారు. ఈ కార్యాక్రమంలో సంఘ కార్యదర్శి ఆరుగొల్లు వెంకటేశ్వర్లు, కోశాధికారి దారపురెడ్డి సూర్యచంద్రరావు, గౌరవాధ్యక్షులు కొత్తపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు పుల్లూరి రామ్మూర్తి, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, పగడాల రామారావు, పాల భాస్కరరావు, జార్జ్, మోహనరావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్ల పంపిణీ

మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు రూరల్: అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని విజ్జేశ్వరం గ్రామంలో మంత్రి దుర్గేష్ మంగళవారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛను నగదు అందజేశారు. నియోజకవర్గంలో 35,817 మంది పింఛన్‌దారులకు రూ.24.18 కోట్ల నగదు అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి దుర్గేష్, ఎంపీడీఓ పి.శామ్యూల్, తహసీల్దార్ నాగరాజునాయక్, మాజీ సర్పంచ్ పూటి వెర్రియ్య పాల్గొన్నారు.



నిడదవోలు మండలం విజ్జేశ్వరంలో పెన్షన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

తాళ్లపూడి మండలంలో 7,657 మందికి..

తాళ్లపూడి: మండలంలో మొత్తం 7,864 మంది సామాజిక పింఛనుదారులు ఉండగా, తొలిరోజైన మంగళవారం 7,657 మందికి పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో టి.వెంకటరమణ తెలిపారు. మండలంలో సచివాలయ సిబ్బంది మంగళవారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలోని ప్రక్కిలంక, తాళ్లపూడి గ్రామాల్లో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, డీపీవో బి.శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటరమణ, మండల టీడీపీ అధ్యక్షుడు నామన పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి మండలంలో 97.95 శాతం

పెరవలి: మండలంలో మంగళవారం 97.95 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీవో ఎస్. రమేష్ తెలిపారు. మండలంలో మొత్తం 10332 మంది పింఛనుదారులకు గాను 10,120 మందికి ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించామని చెప్పారు. మిగిలిన వారకి బుధవారం అందిస్తామని తెలిపారు.

ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి



పెండ్యాలలో నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, భవన నిర్మాణ కార్మికులు

నిడదవోలు రూరల్: ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం కూటమి ప్రభుత్వం తక్షణమే ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని పెండ్యాలలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రగతిశీల భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు వాకా సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం యూనియన్ సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పలు అంశాలపై సభ్యులు చర్చించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కారింకి రమేష్, సభ్యులు వాకా రాంబాబు, వెంకటేశ్వరరావు, మిద్దే రాంబాబు, ప్రత్తిపాటి వెంకటేశ్వర్లు, నాగరాజు, వెలిగట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో స్వచ్ఛతాహి సేవ

నిడదవోలు: గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా హి సేవ అనే నినాదంతో మంగళవారం స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రాంగణ పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, మనోజ్ఞ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని వ్యర్థాలను విద్యార్థులు తొలగించారు. అమ్మ పేరుతో మొక్కలు నాటారు. వ్యర్థ వస్తువులను నుంచి ఒక మంచి వస్తువును తయారు చేశారు. అలాగే విద్యార్థినులు తమ ఇంటి వద్ద తయారు చేసి తీసుకు వచ్చిన కొత్త వస్తువులను ప్రదర్శించారు. ఉత్తమ వస్తువులను తయారు చేసిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. మనోజ్ఞ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు 'స్వచ్ఛ భారత్ - విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాస రచన, యువతపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ఆవరణలోని మహాత్ముని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంఈవో కోడి నాగేశ్వరరావు మనోజ్ఞ ట్రస్ట్ నిర్వాహకురాలు విజయ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి.రుద్ర, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి.ఉషారాణి, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ జె. శోభారాణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.లావణ్య, అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.



పెరవలిలో జాతీయ రహదారిని శుభ్రం చేస్తున్న సిబ్బంది

జాతీయ రహదారిని పరిశుభ్రంగా ఉంచాలి

పెరవలి: జాతీయ రహదారిని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోందని, ఇందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టర్ డి.సురేంద్రనాథ్ కోరారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ముగింపు సందర్భంగా పెరవలిలో మంగళవారం జాతీయ రహదారిని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉంగుటూరు, ఈతకోట టోల్ ప్లాజాల పరిధిలో రోడ్లను శుభ్రంగా ఉంచేందుకు జాతీయ రహదారి సిబ్బంది నిత్యం కృషి చేస్తున్నారన్నారు. వారికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో జాతీయ రహదారి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రక్కిలంకలో గంగాలమ్మ జాతర

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో మంగళవారం గంగాలమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. గోదావరి నదిపై ఆధారపడి జీవించే ఇక్కడి బూరిలంక వడ్డీలు ఏటా గంగాలమ్మకు మొక్కులు సమర్పించడం ఆనవాయితీ. వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా తయారు చేసిన భారీ చేప బొమ్మను ప్రక్కిలంక, తాళ్లపూడి గ్రామాల వీధుల్లో గరగ నృత్యాలు, డీజే శబ్దాలతో ఊరేగించారు. ఇక్కడ నివసించే వడ్డీలు గోదావరిలో పడవలు నడుపుతూ, ఇతర పనులు చేసుకుంటారు. తమ పూర్వీకుల నుంచి ఈ ఆచారం వస్తోందని బూరిలంక వడ్డీలు తెలిపారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు డేరా రాము, దేవరపల్లి శ్రీను, పెంట సతీష్, సంగాటి రాము, శేఖర్, డేరా నాగేశ్వరరావు, సత్తియ్య పాల్గొన్నారు.



గంగాలమ్మ జాతరలో భాగంగా ప్రక్కిలంకలో పూలతో అలంకరించిన చేప ఊరేగింపు

అన్ని పంటలకూ పొటాషియం వాడాలి

- ఏడీఏ చంద్రశేఖర్ సూచన
- పెనకనమెట్ట, దొమ్మేరుల్లో 'పొలం పిలుస్తోంది'

కొవ్వూరు: మండలంలోని పెనకనమెట్ట, దొమ్మేరు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని పంటలకూ విధిగా పొటాషియం ఎరువు వాడాలని సూచించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లను ఈ వారంలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు, చీడపీడల నివారణ గురించి కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యానఅధికారి శ్రీనివాసరావు రైతులకు వివరించారు. బిందు, తుంపర్ల సేద్యంపై అవగాహన కల్పించారు. ఈ తరహా సేద్యానికి ప్రభుత్వం అందిస్తున్న రాయితీల వివరాలను ఆయన రైతులకు వివరించారు. పెనకనమెట్ట పంచాయతీ సర్పంచ్ మేకల శ్రీనివాసరావు, ఏవో ఎ.గంగాధరరావు, రైతులు పాల్గొన్నారు.

శరన్నవరాత్ర ఉత్సవాల సందడి ప్రారంభం

కొవ్వూరు: శరన్నవరాత్ర ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి.ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి శరన్నవరాత్ర మహోత్సవాలకు ఏర్పాట్లు చేసినట్టు ఆ సంఘం అధ్యక్షుడు మట్టే వీర వెంకట వర ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని లాంచీల రేవులోను, ఎరినమ్మ ఘాట్ వద్ద, ఐ.పంగిడి, వాడపల్లి గ్రామాల్లో కనకదుర్గ ఆలయాల వద్ద శరన్నవరాత్ర వేడుకలకు ఏర్పాట్లు చేశారు. ఇక్కడి విద్యుత్ లైటింగ్ కూడా ఏర్పాటు చేశారు. పట్టణంలోని ఐదో వార్డులో అమ్మవారిని ప్రతిష్ఠించారు. పలువురు భక్తులు 9 రోజుల పాటు భవానీ మాలలు ధరించి దీక్షలు చేస్తున్నారు. నిత్యం వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భవానీ భక్తులతో గోష్పాద క్షేత్రం కళకళలాడుతోంది.

మూతపడిన మద్యం షాపులు

అల్లాడిన మందుబాబులు

పెరవలి: ఇప్పటి వరకూ ఉన్న మద్యం పాలసీని కూటమి ప్రభుత్వం క్లోజ్ చేసింది. ఆ స్థానంలో మద్యం కొత్త పాలసీని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తోంది. ఈ క్రమంలో మంగళవారం మండలంలోని ఏడు మద్యం షాపుల సిబ్బంది విధులు బహిష్కరించి సమ్మె చేశారు. దాంతో మండలంలోని మద్యం దుకాణాలు మూతపడ్డాయి. మందుబాబులు మంగళవారం ఉదయం షాపుల వద్దకు వెళితే షాపులు తెరిచి లేవు. దాంతో వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. గ్రామాల్లో దొరికే మద్యాన్ని ఎక్కువ ధరకు చాటుగా కొనుగోలు చేసి సేవించారు. పెరవలి మండలంలో 7 షాపుల్లో పని చేస్తున్న 29 మంది ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. తమకు ప్రభుత్వమే ఉపాధి చూపించాలని వారు కోరారు.

గోపాలపురం మండలంలో సిబ్బంది ధర్నా

గోపాలపురం: మండలంలోని మద్యం షాపుల్లో పని చేస్తున్న సిబ్బంది మంగళవారం ధర్నాకు దిగారు. కూటమి ప్రభుత్వం తీసుకు వస్తున్న నూతన మద్యం పాలసీతో తాము ఉపాధి కోల్పోయి, రోడ్డున పడ్డామని వారు పేర్కొన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ గోపాలపురం, చిట్యాల, దొండపూడి గ్రామాల బ్రాందీ షాపుల్లో పని చేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌బాయ్స్ ఉదయం 11 గంటలకు షాపుల వద్దకు చేరుకుని, వాటిని తెరవకుండా నిరసన వ్యక్తం చేశారు. డిగ్రీలు చదువుకొని ఐదేళ్లుగా ప్రభుత్వ షాపుల్లో పని చేస్తున్న తమకు కాంట్రాక్ట్ పద్ధతిపై వేరే ప్రభుత్వ శాఖల్లో అయినా పనులు కల్పించి ఆదుకోవాలంటూ వేడుకున్నారు. ఈ నెల 5న సూపర్‌వైజర్లు, సేల్స్‌బాయ్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి ఈ సమస్యపై చర్చిస్తామని ఎక్సైజ్ శాఖ అధికారులు సాయంత్రం 6 గంటలకు హామీ ఇచ్చారు. దాంతో రాత్రి 7 గంటల సమయంలో షాపులు తెరిచి అమ్మకాలు సాగించారు.



గోపాలపురంలో వైన్ షాపు వద్ద సిబ్బంది ధర్నా



ఖండవల్లిలో మూతపడిన బ్రాందీ షాపు

ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

నల్లజర్ల: ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి కోతల ప్రారంభానికి ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తహసీల్దార్ పి.కృష్ణారావు ప్రకటించారు. అనంతపల్లి రైతు సేవాకేంద్రంలో మంగళవారం సాయంత్రం రైతులు, రైస్ మిల్లర్లు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష జరిపారు. మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే గోనె సంచులను సిద్ధం చేశామన్నారు. పీఆర్-126 వరి రకాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు 17 శాతానికి తేమ మించకుండా ధాన్యం తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. వరి పంట కోసే ముందు రైతు సేవాకేంద్రం సిబ్బందిని సంప్రదించాలన్నారు. దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏవో కమల్‌రాజ్, సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణ, రైతులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నీకి చాగల్లు మండలం జట్టు

చాగల్లు: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి ఉపాధ్యాయ క్రికెట్ టోర్నీలో చాగల్లు మండలం జట్టు విజేతగా నిలిచింది. ఈ జట్టు పలు దశలలో కోరుకొండ, రాజానగరం, నల్లజర్ల మండలాల జట్లను, ఫైనల్లో రాజమహేంద్రవరం అర్బన్ జట్టును ఓడించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ జట్టు అక్టోబర్ 4, 5 తేదీల్లో విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ క్రికెట్ పోటీల్లో పాల్గొంటుంది. ఈ సందర్భంగా విజేత జట్టు సభ్యులను ఎంఈఓ గురునాథం, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాసమూర్తి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్, పలువురు ఉపాధ్యాయులు, అభినందించారు. జట్టును ముందుండి నడిపించిన, జట్టులో రాణించిన శ్రీనివాస్, పీడీ గంగాధర్, టి.ప్రేమ్ చంద్‌లను పలువురు అభినందించారు.



రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ క్రికెట్ పోటీలకు ఎంపికైన చాగల్లు మండల క్రికెట్ జట్టు

బాధిత కుటుంబానికి 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని చీపురుగూడేనికి చెందిన వసంతాడ మధుబాబు కుటుంబం గాయపడింది. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆ కుటుంబానికి మానవత సంస్థ మండల శాఖ మంగళవారం రూ.15,000 ఆర్థిక సాయాన్ని అందజేసింది. చీపురుగూడేనికే చెందిన చెల్లు తిరుమల శ్రీనివాస్ మరో రూ.5,000 మధుబాబు కుటుంబానికి అందజేశారు. కాగా మధుబాబుతో పాటు నల్లజర్లలో చదువుకున్న అప్పటి టెన్త్ బ్యాచ్ విద్యార్థులు రూ.45 వేలు సేకరించి మధుబాబు కుటుంబానికి అందజేశబూరు. అలాగే అనంతపల్లిలో అనారోగ్యానికి గురైన తెప్పల అబ్బులు, తమిర్శి సరోజని, సింగదాసు కమలకుమారి, తగరం వెంకమ్మ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున రూ.16,000 మానవత సంస్థ సభ్యులు మంగళవారం అందజేశారు. కార్యక్రమాల్లో ఆ సంస్థ చైర్మన్ భోగవల్లి వెంకటసుబ్బారావు, మండల కన్వీనర్ గుళ్లపూడి వెంకటరత్నం, పాల్గొన్నారు.



చీపురుగూడెంలో మధుబాబు కుటుంబానికి సొమ్ము అందిస్తున్న 'మానవత' ప్రతినిధులు

తాళ్లపూడి: ప్రక్కిలంక గ్రామానికి చెందిన 69 ఏళ్ల వంటరి వృద్ధురాలు సువ్వారి సరోజినికి మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు మంగళవారం రూ.ఆరు వేల ఆర్థిక సాయం చేశారు. ఇటీవల భర్తను, కుమారుడుని కోల్పోయిన ఆ వృద్ధురాలు కుటుంబ పోషణకు, వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతోంది. ఈ విషయం తెలిసిన మానవత సంస్థ అధ్యక్షుడు అంకెం సురేష్‌కుమార్ చేతుల మీదుగా ఈ ఆర్థిక సాయాన్ని చేశారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చాగల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

చాగల్లు: గత నెల 26న ఏలూరులో నిర్వహించిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో చాగల్లు విద్యార్థినులు సత్తా చాటారు. చాగల్లు జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థినులు 10 మంది రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వీర్రాజు, పేరెంట్ కమిటీ చైర్మన్ గోపాలకృష్ణ తెలిపారు. అండర్-19 విభాగంలో రమ్య, శైలజ, వైష్ణవి, భవాని, సంజన, జాహ్నవి దుర్గ, అండర్-14 విభాగంలో మోహిని, ప్రవల్లిక, పావని, జోస్నవిలు ఎంపికయ్యారన్నారు. వారిని పలువురు అభినందించారు.